# బీఆర్ఎస్‌ను గెలిపించండి..అభివృద్ధికి సహకరించండి

నేను స్థానికుడిని.. ఇతరులకు ఖమ్మం ఒక ఆప్షన్ ..

ఓడినా, గెలిచినా ఖమ్మం వదిలి వెళ్లలేదు

ఆత్మీయ సమ్మేళనంలో

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 21 : ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. తన ఏకైక లక్ష్యం ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ఖమ్మం 58వ డివిజన్ రాపర్తినగర్‌లో వేముల రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ మాట్లాడారు. తాను స్థానికుడినని, ఖమ్మం భూమి పుత్రుడినని అన్నారు. కానీ ఇక్కడికి వచ్చే వారికి ఖమ్మం ఒక ఆప్షన్ మాత్రమేనని అన్నారు. వేరే చోట సీట్లు రాకపోయినా, అవకాశాలు లేకపోయినా వారు ఖమ్మం వైపు చూస్తారని విమర్శించారు. తాను ఎప్పుడూ అలా చేయలేదని, తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు ఖమ్మంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసినా, మరికొన్ని సార్లు ఓడిపోయినా ఇక్కడే ఉన్నారని, పక్క దిక్కులు చూడలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా తనకు అవకాశం వచ్చిందని, ఆ తరువాత అనతి కాలంలోనే ఖమ్మాన్ని తీర్చిదిద్దానని, అభివృద్ధిలో మేటిగా నిలిపానని వివరించారు. ఇప్పటికే ఖమ్మం ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం వైపే ఉన్నారని, ఇక ముందు కూడా ఇలానే ఉండి అండగా నిలిచి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఖమ్మంలో తనకు అత్యధిక మెజారిటీ అందించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మీరు మంత్రులుగా ఉన్నారు ఏం తీసుకొచ్చారు.. ఏం అభివృద్ధి చేశారో చూపాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరానికి ఐటీ హబ్ తీసుకొచ్చానని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వేల మంది జిల్లా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించానన్నారు. మున్నేరు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుతున్నదని, కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలని, బ్రిడ్జికి ఇరువైపులా కరకట్ట నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. అక్కడ ప్రజల వినతి మేరకు నేడు రూ.180 కోట్ల తో కొత్త కేబుల్ బ్రిడ్జి నిర్మాణం తీసుకొచ్చినానని, రానున్న రోజుల్లో కాల్వొడ్డు ప్రాంతం హైదరాబాద్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిని తలపిస్తుందని, ఇది మీరు ఉన్నప్పుడు ఎందుకు రాలేదన్నారు. మాటలు చెప్పడం కాదు. పని చేసినప్పుడే ప్రజలు గుర్తిస్తారన్నారు. ఇప్పటికే ఖమ్మం ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం వైపు ఉన్నారని, ఇక ముందు కూడా ఇలానే ఉండి అండగా నిలిచి బీఆర్ఎస్ ప్రభుత్వానికి విజయం అందించాలన్నారు. సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బత్తుల మురళీ, పారా నాగేశ్వర రావు, ప్రసాద్, రాయల పద్మజ, కందుల రాగిణి, సత్యనారాయణ రెడ్డి, మల్లి కార్జున, వేముల పూర్ణ, వేముల పవన్ కళ్యాణ్, వేముల నవీన్ ఉన్నారు.



తాళ్లూరి జీవన్‌కుమార్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు

## బీఆర్ఎస్‌లో చేరిన తాళ్లూరి జీవన్

ఖమ్మం, అక్టోబర్ 21 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఖమ్మం కమ్మ మహాజన సంఘం జిల్లా సెక్రటరీ తాళ్లూరి జీవన కుమార్ శనివారం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన జీవన్‌కు మంత్రి పువ్వాడ గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రితో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, నాయకులు బత్తుల మురళీ, గొల్లపూడి హరికృష్ణ, పగడాల నాగరాజు జీవన్ కుమార్ కు అభినందనలు తెలిపారు.

## బీఆర్ఎస్‌లో 100 కుటుంబాలు చేరిక

ఖమ్మం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సింగు శ్రీనివాస్‌తోపాటు 100 కుటుంబాలు శనివారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బుర్రా వెంకటేశ్వర్లు, యాకూబ్ మియా, గొనెల వెంకన్న, కే. శ్రీను, అంజయ్య, గొనెల శ్యాం, అంబటి మట్టయ్య, సురేశ్‌తో పాటు 100 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు చేసిన సంక్షేమం ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయలేదని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ, కుడుములు సత్య నారాయణ, మెడ మచ్చగిరి, జాలా రామయ్య ఉన్నారు. 31వ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెల్లంపల్లి వెంకట సుబ్బారావు తిరిగి గులాబీ గూటికి చేరుకున్నారు. మంత్రి అజయ్ సమక్షంలో ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గాల సమన్వయకర్త ఆర్‌జేసీ కృష్ణ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు జోకుపర్తి సుబ్బారావు, ఎపురి రాధిక, గజ్జెల కృష్ణ, శోభా, ప్రణతి, సిరి ఉన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి కేసీఆర్‌కే సాధ్యం

ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి పట్టణంలో షాప్ టూ షాప్ ప్రచారం

ఘనస్వాగతం పలికిన వ్యాపారులు

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 21 : రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని కొనసాగించాలంటే సీఎంకే కేసీఆర్‌కే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం ఆయన సత్తుపల్లి పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలలో షాప్ టు షాప్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి షాప్‌కు వెళ్లి తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ అందించిన పథకాలను, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను వ్యాపారులకు అందిస్తు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటువేయాలని కోరారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర జరిగిన ప్రచారంలో వ్యాపారులు సండ్రకు అపూర్వ స్వాగతం పలికారు. వాటర్ బాటిళ్లు, కొబ్బరినీళ్లను అందిస్తూ వ్యాపారులు తమ అభిమానం చాటుకున్నారు. ప్రచారంలో భాగంగా సండ్ర బజ్జీలు వేస్తూ, కొబ్బరిబోండాలు కొడుతూ వ్యాపారులు, కార్యకర్తలను ఉత్తేజపరిచారు. ముస్లిం సోదరుడు ఎమ్మెల్యే సండ్రకు ఇమామి జామీను కట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మచైర్మన్ వనమా వాసు, మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, చాంద్‌పాషా, ప్రవీణ్, రాఘవేందర్‌రావు, గఫార్, రామిశెట్టి రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, అంకమరాజు, నాయకులు మాధురి మధు, సురేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

# నేడు సద్దుల బతుకమ్మ సంబురం

బతుకమ్మకు వీడ్కోలు పలకనున్న మహిళలు

నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లు పూర్తి

అర్ధరాత్రి వరకు కొనసాగనున్న సంబురాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బతుకమ్మ పూలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 21 : తొమ్మిదిరోజులు తీరొక్కపూలతో సంబురంగా జరుపుకున్న బతుకమ్మ పండుగకు సద్దుల బతుకమ్మతో వీడ్కోలు పలికేందుకు మహిళలు సిద్ధమయ్యారు. తీరొక్క పూలతో బతుకమ్మలను చేసి మహిళలు పెద్దఎత్తున ఆటలు ఆడి పాటలు పాడి చల్లంగా చూడమ్మ బతుకమ్మ తల్లి అంటూ గౌరమ్మను కొలిచారు. రోజుకో ప్రసాదంతో బతుకమ్మకు నైవేద్యం సమర్పించి గల్లీ నుంచి పట్నం వరకు వార్డుల్లో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రోజుకొక కార్యాలయం వద్ద బతుకమ్మ ఆటలు ఆడి సంబురంగా వేడుకలు నిర్వహించుకున్నారు. తొమ్మిదిరోజులపాటు నిర్వహించిన ఈ వేడుకలు చివరిరోజు ఆదివారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా సంబురాలు నిర్వహించుకునేందుకు ఆయా ఘాట్ల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే సద్దుల బతుకమ్మ ఉత్సవాలు అంబరాన్నంటేలా ఉండనున్నాయి. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి మొర్రేడువాగు, రామవరం గోధుమవాగు, రుద్రంపూర్‌లోని ధన్‌బాద్ చెరువు, పాల్వంచ పట్టణంలోని పాత పాల్వంచలో ఉన్న రాతిచెరువు కట్ట, వికలాంగుల కాలనీలోని చింతలచెరువు, సుజాతనగర్, చుంచుపల్లి, పాల్వంచ మండల పరిధిలోని ఉత్సవ కమిటీల నిర్వాహణలో బతుకమ్మ సంబురాల్లో భాగంగా అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లాకేంద్రంతోపాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మహిళలు సిద్ధమవుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో సీఐలు తమ సిబ్బందితో కలిసి ఘాట్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించి ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచనలు చేశారు. పోలీస్‌శాఖ పటిష్ఠ బందోబస్తు నిర్వహించనున్నారు.

# ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వీడియో కాన్ఫరెన్సులో అధికారులతో సమీక్ష

మామిళ్లగూడెం, అక్టోబర్ 21: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే తనిఖీల్లో పట్టుబడే నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, డీజీపీ అంజనీకుమార్, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా, ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు 10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని, 10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలన్నారు. సదరు నగదుపై వచ్చే అప్పీళ్లను సంబంధిత గ్రీవెన్స్ సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించే ఫిర్యాదులను సైతం దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీసీపీ విజయకుమారి, సీపీవో ఏ.శ్రీనివాస్, డీపీఆర్వో ఎం.ఏ. గౌస్, ఏసీపీ గణేష్, ఎన్నికల విభాగ తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, సీపీ

# గులాబీ జెండా ఎగరడం ఖాయం

ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 21 : రాబోయే ఎన్నికల్లో పాలేరులో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని సాయిగణేష్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 60వ డివిజన్ రామన్నపేట కాలనీకి చెందిన పలు కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. డివిజన్ కార్పొరేటర్ బీ నిరంజన్ ఆధ్వర్యంలో జంగం నవీన్, ఎస్‌కే భాషా, ఆశా, ఫియాజ్, గోపీ బాబా సాహెబ్‌తో సహా మొత్తం 50 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ ఎమ్మెల్యే గులాబీ జెండా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఎవరెన్ని కుయుక్తులు, కుట్రలకు తెరలేపిన చివరకు పాలేరు ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడుతారన్నారు. ఎన్నికలు రాగానే ఒకరిమీద ఒకరు పోటీపడి ప్రజలపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్న సంగతి ప్రజలు గమనిస్తున్నారన్నారు. వలస వాదులకు వచ్చే ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదన్నారు. సీఎం కేసీఆర్ అంటేనే ప్రజ సంక్షేమ ప్రధాత అని ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించే విధంగా పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.